


'మొత్తానికి ప్రైజు రాదంటావు! నీ భరతవాక్యం బంగారంగాను గాని మానవయత్నం లోపం ఉండకూడదు గదా!' అన్నాడు కృష్ణారావు.

'అవకాశాలు ఏ కోశానా లేవు,' అన్నాడు భానుమూర్తి దృఢంగా.

'వస్తే...; ఏమిస్తావు?'

'హతోస్మి! ప్రైజు వచ్చే ప్రమాదమే తప్పనిసరిగా సంభవించిననాడు, దక్షిణ తాంబూల సమర్పయామి!... వాళ్ళెలాగూ ఏదో యింతయిస్తారు. నేను, నీకూ రాధకూ దీపావళిబట్టలు కుట్టిస్తాను.'

'ఐతే! మధ్యను రాధ కెందుకు! అన్నాడు నవ్వుతూ.

'ఎందుకా! అదెందుకో నీచేతే చెప్పిస్తానులే. నే నూరుకున్నా పద్మ ఊరుకోదు. అది నీకూ తెల్సు; వస్తాను మళ్ళీ.' అంటూ వెళ్ళిపోయాడు.

కృష్ణారావు ఆలోచనలో పడ్డాడు. రాధామయ తీయని ఊహలలో తేలిపోతోంది మనసు.

ఒకే ఆఫీసులో పనిచేస్తున్న పరిచయం రానురాను వృద్ధిపొందింది. పేర్ల కలయికలో మృదుత్వం వారి స్నేహాన్ని దృఢతరం చేసింది. రాధకు కృష్ణారావుతోను, పద్మకు భానుమూర్తితోను కలిగిన స్నేహం వృద్ధిపొంది, కాలగమనంలో పేరును మార్చుకుంది. పద్మ, రాధ యిరుగుపొరుగువారు. భానుమూర్తి తలిదండ్రులతో ఉంటున్నాడు భానుయింటికి, కృష్ణరామునకు కనీసం మైలున్నర ఉంటుంది. కృష్ణ తీరికసమయాల్లో కథలు వ్రాస్తుంటాడు. ఒక్కొక్కసారి గమ్మత్తుగా కలం ముడుచుకుపోతుంది పొరుగింట్లో రేడియోగీతాలు శ్రావ్యంగా కిటికీలోంచి ప్రవేశించి తన మనసును మళ్ళించేస్తుంటాయి. కృష్ణకు కథలు వ్రాయడం, సంగీతం వినడం ఒకదాని నొకటి మించిన పిచ్చి. ఈ ఊహ రాగానే తీయని చిరునవ్వు వెల్లివిరుస్తుంది.


రాధాసుందరి సంగీతం నేర్చుకుంది. వీణ వాయిస్తుంది. మామూలు సినిమా పాటలు మనసు తీయగా పాడుతుంది.

ఇంతలో కథానిక జ్ఞాపకం వచ్చి యదార్థ ప్రపంచంలోకి వచ్చాడు. తటాలున లేచి చేసిన మొదటిపని కేలండరు తీశాడు. మిగతా కవులకున్నపిచ్చి చేదస్తం కృష్ణారావుకూ ఉంది. 'నశ్యం పండిత లక్షణం' అన్న దొక్కటిమాత్రం లే దెందుచేతనో!

రెండురోజులు బాగాలేవు. ఖర్మం! అనుకున్నాడు. మూడవనాడు సాయంత్రం నాలుగునుండి బ్రహ్మాండంగా ఉంది. రాత్రి ఎనిమిదింటికి వర్షం వచ్చేలోగానే యింటికి వచ్చేసి అధమం మొదటిపేజీ పూర్తిచేసేయాలని నిశ్చయించుకున్నాడు. కలం కాగితంమీద పెడితే ఆగదన్న ధైర్యం ఎలానూ ఉంది. ఉత్సాహంగాలేచి సినిమాకు పోదా మనుకున్నాడు. భానుమూర్తి లేడు. టైము చూశాడు. ఆరూ నలభై! నీరసంగా చేరబడిపోయాడు ఈజీఛేరులో.

* * *

కృష్ణ టైము చూశాడు. నాలుగూ పది. ఇంక మిగిలినపని వేగిరం తెముల్చుకోవాలి. ఒక పదినిముషాలు ముందుగానే ద్వారం దాటేయాలి. గబగబా వ్రాస్తున్నాడు. ఆవేళ మామూలుకన్న పని ఎక్కువే ఐనా రెట్టించిన ఉత్సాహంతో ఒక్క నిముషం వృధాచేయకుండా చేసు




కొచ్చాడు. సాయంత్రం కధానిక ప్రారంభించాలి. దానికీ ఈ దీక్ష,

ప్యూను అప్పలస్వామి ప్రవేశించాడు రంగంలోకి. వీ డెక్కడ సైంధవుడు దాపురించాడు అనుకుంటూ వాడి వెనకాతలే వెళ్ళాడు ఆఫీసరు గదిలోకి. ఆఫీసరు ఒక ఫైళ్ళదొంతర అందించాడు. 'హెడ్డాఫీసు కరస్పాండెన్సు. ఈ వేళలా గైనా డిస్పోజై పోవాలి. ఎంత రాత్రైనాసరే. అంతవరకూ మనం కదలడానికి వీల్లేదు.'

మనిషి నిలువునా నీరుకారిపోయాడు. తను ఈ రోజంతా యింత కష్టపడి చేసినకష్టం వృధాఐంది. నిస్సహాయంగా చూశా డా ఫైళ్ళవంక. సరిగ్గా ఈనాడే రావాలా! తన నిప్పుడు వదిలేస్తే, రాత్రి ఎనిమిదింటికి వచ్చి కావాలంటే తెల్లవార్లూ జాగారం చేయడానికైనా సిద్ధం. ఈ మధ్యకాలమే తన కత్యంత ముఖ్యం. ఆమాటే అన్నాడు.

'ఇది గవర్నమెంటాఫీసనుకున్నావా? కోమటికొట్లో పద్దులు వ్రాయడ మనుకున్నావా? మైండ్ యువర్ బిజినెస్.' ఉగ్రుడై పోయాడు.

'గవర్నమెంటాఫీసే ఐతే ఐదు గంటలకే మూసేసి ఉండేవారు!' అన్న మాట నాలుక చివరవరకూ వచ్చిన దాన్ని, పెదాలతో బిగబట్టి యివతల కొచ్చేశాడు.

సంభాషణ యివతలకు వినపడడాన్ని మిగిలినవారు వింతగా చూస్తున్నారు. అందులో ఆనాడు కృష్ణ ఏకదీక్షగా ఉండడంలోనే ఏదో విశేషం ఉందనుకున్నారు. అతనికి సరిగా సాయంత్రమే పని

ఉందని అర్థమైంది. అందరికన్నా మాలతీలత హుషారుగా తల త్రిప్పి నిటారుగా కూర్చుంది. ఆమె నలాగా చూడగానే కృష్ణకు పళ్ళు పట పట లాడాయి. వా రిద్దరి మధ్యా అభిప్రాయ భేదాలు అవధులు దాటేయి. అసలు కారణం మాత్రం అతిసామాన్యం. నేటి నాగరికుల తెగని సమస్య : స్త్రీ పురుషునితో సర్వసమానం అని మాలతి– ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా స్త్రీ...స్త్రీయే అంటాడు కృష్ణ.

సరిగా ఐదైంది. పద్మ, రాధ అమ్మాయి లందరూ కలాలు ముడిచేసి లేచారు. కృష్ణ అలా ఉండడం రాధకు బాధగా ఉంది. చేసేదిలేక జాలిగా చూస్తూ సాగిపోయింది.

'స్త్రీ పురుషునితో సర్వసమానం. దాని కిదే నిదర్శనం. ఐదవగానే ఆఫీసు వదుల్తుంది. ఎవరూ ఆపలేరు. మాలతి కృష్ణ ముందునుంచి వెళ్తూ ఒక చెణుకు విసిరింది. అగ్నిలో అజ్యమైంది కృష్ణకు.

'ఆ నిదర్శనం అబలాత్వానికి అచ్చ తెనుగు, చేతగాని తనం. మాతో సమానం అవాలంటే రాత్రి మాతో సమానంగా పదిగంటలవరకు ఉండాలి.'

కృష్ణారా వన్నమాటకు మగవాళ్ళంతా గొల్లున నవ్వేరు. మాలతీలత కళ్ళెర్ర బడ్డాయి క్రోధంతో. కాని చేసేదిలేక తలదించుకుని విసవిస నడచిపోయింది, తన క్రోధాన్ని నడకపై చూపిస్తూ. ఆమెకు ప్రతీసారీ యిలానే అవుతుంది. కృష్ణకు చావుదెబ్బ కొట్టా లని ప్రతిసారీ ప్రయత్నిస్తుంది. కాని తిరిగి తననే భూస్థాపితం చేసేస్తున్నాడు.

మొత్తానికి కృష్ణ కథానికా ప్రారంభం ఆ నా డావిధంగా ఆగిపోకతప్పలేదు. ఈ భానుమూర్తిగాడి పైర్జు రాదన్న అపశకున ఫలితం ప్రథమ సోపానం అనుకుని ఊరుకోవడంకన్నా గత్యంతరం లేదు.

తరువాత మూడు రోజులకు ముహూర్తం కుదిరింది. ఐదయేసరికల్లా సరాసరి ఎవరినీ దారిలో పల్కరించకుండా యింటికి చేరుకున్నాడు. మామూలు తతంగంతో ప్రారంభించాడు. ప్రారంభంలో కలం కాస్త బద్ధకం చూపిస్తుంది. అరగంటలో అరపేజీ మాత్రం సాగింది. ఇంక లాభంలేక కాళ్ళు టేబిలుపై చాసేసి చారబడ్డాడు ఆలోచిస్తూ.

భానుమూర్తి, పద్మ, రాధ ఒకరివెనుక ఒకరు గదిలో ప్రవేశించారు. వారివైపు కృష్ణ అయోమయంగా చూశాడు. ఆ ముగ్గురు తనను సినిమాకు బయల్దేరమని బలవంతం చేశారు.

'మీరు రాకపోతే నేనూ వెళ్ళను రాధ బుంగమూతి పెట్టుకూర్చుంది.

చిరునవ్వుతో కృష్ణ లేచాడు; కథానిక డ్రాయరు సొరుగులోపెట్టేశాడు. సడన్‌గా జ్ఞాపకం వచ్చింది. 'నన్ను బయల్దేరిస్తు

న్నారు గాని కనీసం నా ఒక్కడి టీ ఖర్చుల కైనా నా దగ్గ రున్నట్టులేదు.

'డబ్బు ఖర్చుతో మీకు నాకు సంబంధంలేదు. అంది రాధ.

అంతరార్థం అర్థం కాలేదు. అడిగితే వా రెవరూ చెప్పారు కారు. సినిమా తిరుగుదారిలో భానుమూర్తి ఇలా వివరించాడు. అది కేవలం స్త్రీల పందెం. తన వలన సంగతి తెలుసుకున్న పద్మ రాధతో పందెం వేసింది. రాధ ధైర్యంగా సరేనంది. కాని పద్మ ఎందు కలా పందెం వే సిం దో రాధ కింతవరకూ తెలీదు ఈరోజు ఈ సమయంలో కృష్ణ కథానికని ప్రారంభిస్తా డని భానుమూర్తికి తెలుసు. కృష్ణ అంత హడావుడిగా ఎందు కెళ్ళిపోయాడా అని అడిగిన పద్మకు చెప్పేడు. స్త్రీ సహజమైన ఉత్సాహం కల్గింది. ఇలాంటప్పుడు రాధ అతనిని సినీమాకు పిలిస్తే వస్తాడా ? రానంటాడా? రాధమీద కృష్ణకు అభిమానం ఎంత పాటిది ? రాధపై తనకు గల అభిమానం కొలదీ, రాధ భవిష్యత్తులో పొందగలిగే ఆనందం తెల్సుకోవా లనుకుంది. రాధ గెలిస్తే సినిమా ఖర్చు తనది.

ఐతే ! విషయం ఫలానా ! అని ముందుగా రాధకు తెలిస్తే, రాధ ఎంత మాత్రం అంగీకరించదు. కృష్ణపై రాధకు గల అభిమానం తనకు కరతలామలకం.

విషయం స్పష్టం కాగానే రాధ చాలా నొచ్చుకుంది. స్వయంగానైనా అన్యాసక్తంగానైనా కృష్ణ ప్రయత్నానికి తాను ప్రతిబంధకంగా నిల్చింది. ఐనా కృష్ణ, తన మాట కెంత విలు విచ్చాడు ! ఎంత గౌరవం తనయందు చూపించాడు ! ! తన మీద అతనికున్న అభిమానం ఎంత ఆశ్చర్యాని కంతులేదు. శరీరం పులకరించింది. మెల్లగా కృష్ణవంక చూసింది. భావయుక్తమైన చిరునవ్వు మాత్రం ముఖంలో గంభీరతకు ప్రతిచిహ్నంగా ప్రకాశిస్తుంది. హృదయపూర్వకంగా మనసులోనే కృష్ణకు నమస్కరించుకుంది.

* * *

కృష్ణ యింటికి వచ్చి ఏకధాటిగా వ్రాతకు పూనుకున్నాడు. ప్రారంభం ఏదో ఊరూ పేరూ వ్రాసేశాడు. కాని కథావస్తువు తెగలేదు. ప్రేమ వివాహం వ్రాద్దా మన్నది సంకల్పం.

ప్రథమ వీక్షణప్రణయం పాతచింత కాయపచ్చడైపోయింది. కాలేజీప్రయణం ధర్మరాహిత్యం, అసందర్భం, రామాయణంలో పిడకలవేట ఇరుగు పొరుగు, వర్ణాంతర ఆదర్శప్రకటన సామాన్యమైపోయాయి. ఒక అరగంట సరికల్లా ఒక కథావస్తువు మదిలో మెరిసింది.

కామేశం ఆఫీసుకు వెళ్ళే దారిలోనే కామేశ్వరి యిల్లుంది. అందుచేత కామేశం రాగానే కామేశ్వరి బయల్దేరేది. ఇరువురు రానూపోనూ కలిసే వచ్చేవారు

సంవత్సరానికి పైగా. నలుగురితో నారాయణా అని కామేశ్వరి ఫ్లూతో మంచమెక్కింది. ఆనాడు కామేశానికి దారి తరగలేదు. ఆఫీసు ఫైళ్ళలో కామేశ్వరి మొగమే కన్పించేది. ఆశ్చర్య పోయాడు. అంతస్పష్టంగా ఈనా డర్ధమైన యదార్థం తనింతకాలంగా గమనించలేదు. కామేశ్వరి ఆఫీసుకు రాని పదిహేను రోజులు తాను పిచ్చివాడిక్రిందే భావించుకున్నాడు. కామేశ్వరి కోలుకున్న తరువాత, ఆహ్లాదకరమైన సాయం సంధ్యాసమయంలో తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు. కామేశ్వరి తృళ్ళిపడింది. తన కా అభిప్రాయమే లేదు; ఇంతలో వివాహం చేసుకునే ఉద్దేశం అంతకన్నా లేదు. తనకు ఆంగీకారం కాదన్న విషయం స్పష్టంగా తెలియపర్చింది నిర్మలమైన మనసుతో.

అప్పటికి ఆరు పేజీ లైనాయి. ఇంక వ్యథాభరిత దృశ్యం విపులీకరించాలి. ప్రస్తుతం తన మూడ్ బాగులేదు. రచన ఆపేసి దీపం ఆర్పేశాడు. ఒక విధమైన విజయానందంతో హృదయం తేలికై హాయిగా నిద్ర నాహ్వానించింది.

* * *

ఆవేళ రాధ ఆఫీసుకు రాలేదు. సెలవుచీటికూడ పంపలేదు. తన కథా సారాంశం సంతోషంతో చెపుదా మనుకున్నాడు కృష్ణ. సరేనని రేపటికి వాయిదా వేసి సాయంత్రం వ్రాత ప్రారంభించాడు.

ఇంతలో ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చాడు భానుమూర్తి. 'కృష్ణా కొంప మునిగిందిరా' అంటూ పడేశాడు శుభలేఖ—

రాధాసుందరిని –మురళీధరరావుకు ఇచ్చి పెళ్ళి. కృష్ణకు కళ్ళు చీకట్లు క్రమ్మేయి. అనుకోని ప్రళయం, యాక్సిడెంటు.

'ఏమిట్రా యిది...!' అనగలిగాడు ఊపిరి బిగబట్టి

'రాధ ఎందుకు రాలేదా అని పద్మ వెళ్ళింది వారియింటి వాతావరణమే మారిపోయింది ఈ మురళీధరుడు రాధకు మేనత్తకొడుకు. వారి వివాహం పెద్దల దృష్టిలో రాధ పుట్టగానే నిశ్చయమైపోయింది. అసలు వాడిపేరు మురళీధరుడు కావడాన్నే రాధకు ఈ పేరు పెట్టారు. అంత కాంక్రీటుడుగా నిర్ణయం జరిగింది. అప్పుడప్పుడు సెలవులలో వాడు ఒకటి రెండురోజులువచ్చిపోతున్నాడు. అప్పుడు రాధ సరదాగానే మాట్లాడుతుండేది. ఎందుచేతంటే వా రిద్దరకూ విరోధం అంటూ ఏమీలేదుగదా! దానిని వధూ పరుల పరస్పరాంగీకారంక్రింద ధ్రువపర్చేసుకున్నారు. నిన్నసాయంత్రం ఉభయ పార్టీలు పెళ్ళిబట్టలు కొనడానికని అనుకుని ఆ మురళీధరుడు వాని తలిదండ్రులు వచ్చేరు. పనిలో పని అని ఆ సమయా



యు వ

నికే రెండువైపుల పెళ్ళి కొడుకులు అచ్చ యాయి. ఇంకా పెళ్ళి యిరవై రోజు లుంది.'

'ఐతే రాధేమంటున్నట్టు? ఒప్పు కుందా దీనికి?'

'రాధ వీల్లేదంది. అన్నకూతురు తన కోడ లవ్వాల్సిందే నని భీష్మించుకుని కూర్చుంది ఆవిడ. రాధ ఏడుపుకు లంకించుకుంది. ఇంతవరకూ వచ్చినతరు వాత ఏమైనాసరే జరిగితీరాల్సిందే నంటాడు రాధతండ్రి. ఇంచుమించుగా రాధను బంధించారు. పద్మ వెళితే, పద్మతో విషయం అంతా చెప్పింది. పద్మ నీ దగ్గరకు తిన్నగా వచ్చే ధైర్యంలేక నా దగ్గరకు వచ్చింది.'

'ఉండండి పెద్దవాళ్ళెందు కింత మూర్ఖంగా ప్రవర్తిస్తుంటా రప్పుడప్పుడు? ఉండు నేనే సరాసరి వెళ్ళి...'

'అబ్బాయ్ ఈ పరిస్థితిలో ఎవరూ చేయగలిగిం దేమీలేదు. తొందరపడితే మొదటికే మోసం రావడం ఖాయం.'

భానుమూర్తి వెళ్ళిపోయాక కృష్ణ కుర్చీకి చేరబడిపోయాడు. తను వ్రాస్తున్న కథానికలోని పాత్రలు తన్ను శపిం చాయా అన్నట్లుంది.

భానుమూర్తి మరల వచ్చాడు. తనకు అనుకోకుండా తోచినసలహా చెప్పాడు. కృష్ణకుకూడా నచ్చింది. భానుమూర్తి శరవేగంతో బయల్దేరాడు సరాసరి పద్మ యింటికి.



తాడో పేడో తేలిపోవాలి దీనితో అనుకున్నాడు కృష్ణ. మనసు కాస్త కుదుట పడింది. తనకు తానే ధైర్యం చెప్పు కున్నాడు. నిటారుగా కూర్చున్నాడు. తన ప్రస్తుతస్థితి నాధారంగా వ్రాస్తున్నాడు...

కామేశ్వరిచే నిరాకరింపబడిన కామేశంపరిస్థితి తలక్రిందైంది. వచ్చిన నాడు ఆఫీసుకు రావడం, లేనినాడు లేదు.

ఎవరితోనూ మాట్లాడడు. తనను పూర్వం లాగ కలియకపోవడాన్న అతనికి కోపం వచ్చిఉంటుం దని అనుకుంది కామేశ్వరి. తనంతకన్నా అతనిని పట్టించుకోవడం మానేసింది. ఏమీ తోచక కామేశ్వరి ఒకనాడు సాయంత్రం పార్కుకు వెళ్ళింది. ఒక మారుమూల అయోమయావస్తలో, ప్రపంచాన్ని విస్మరించి, దిగంతాలవైపు చూడ్కి నిగిడించి, శూన్యాన్నిమాత్రమే చూస్తూ, చలనం లేకుండా, చెట్టుకు చేరబడిఉన్న కామేశాన్ని చూసింది. క్షణకాలం మనోవాక్కాయ కర్మలా స్థంభించి పోయింది. పల్కరించడానికి ధైర్యం చాలక యిల్లు చేరుకుంది. కామేశ్వరికి తిండి సహించలేదు. నిద్రరాలేదు. కన్నుమూసినా తెరచినా కామేశం రూపమే. వ్యక్తంకాని భయం! భరింపరాని ఆందోళన! తన బాధ్యత ఎంతో యితమిద్ధంగా తేల్చుకోలేని మతి స్థిరానికి రాకుండాపోయింది. వారంరోజ లయేసరికి సగానికి సగమైంది మనిషి. ఈ భయంకర పరిస్థితినుండి బయటపడే మార్గం...?

కామేశ్వరి కామేశాన్ని అతని రూములో కలుసుకుంది.

కథానికను పూర్తిచేసి కృష్ణ, 'హృదయ స్పందనం' అని పేరు వ్రాసి మరునాడు పోష్టుకు రడీచేశాడు.

* * *

కృష్ణ సందేశం భానుమూర్తి చెప్పాడని పద్మద్వారా తెల్సుకుంది రాధ. తన దుఃఖాన్ని వర్జించింది. తన జీవిత పర్యవసానం తేల్చుకోవాలని కృతశ్చయురాలైంది. చిరునవ్వుతో పద్మను సాగనంపింది.

రాత్రి భోజనా లనంతరం అందరూ నిద్ర కుపక్రమించారు. సరిగా గోడగడియారం పన్నెండు కొట్టింది.

రాధ లేచింది. తల్లి, మేనత్త, చెల్లెళ్ళిద్దరూ హాయిగా నిద్రపోతున్నారు. ప్రక్కగదిలో తండ్రి, మామయ్య, తమ్ముడు, అక్కకొడుకు నిద్రపోతున్నారు. పెళ్ళికొడుకు అనే ప్రత్యేకగౌరవంతో వీధివైపుగదిలో ఫానుక్రింద నిద్రపోతున్నాడు మురళీధరుడు. అసలా గది తనది. కాని పరిస్థితి మారింది.

నెమ్మదిగా వెళ్ళి తలుపు తట్టింది. కొంచెం గాభరాపడి లేచాడు మురళీధరుడు. గడియ తీసి రాధను చూడగానే రెట్టింపు గాభరా పడ్డాడు. ఏదో అందామని నోరు మెదిపేలోగానే రాధ అతనిని త్రోసుకుని లోపలికి వచ్చి తలుపు గడియ వేసింది. రాధ స్థిరచిత్తంతో అతనికి వాగ్బంధనం చేసి మంచంపై కూర్చునేలాగ చేసి తాను కుర్చీలో కూర్చుంది.

వివాహము...! అన్న పదానికి నిర్వచనం విపులీకరించింది. ప్రపంచంలో ఎన్నో ఖండా లున్నాయి.. ఒక్కొక్క ఖండంలో ఎన్నో భాషా ప్రాంతా లున్నాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఎన్నో మతా లున్నాయి. మతంలో ఎన్నో జాతులూ ఆచారాలూ ఉన్నాయి. వివాహాని




కిలాంటి ఆచారాలు సవాలక్ష ఉన్నా, మూలసూత్రం మాత్రం ప్రపంచానికంతటకూ ఒకే ఒక్కటి. అదే, వధూవరుల పరస్పరాంగీకారం. దీనిని కాదని అక్కడక్కడ జరిగే రాక్షసవివాహాలలో సగానికిపైగా, ఆత్మహత్యల్ని పరిణామాలుగా మిగుల్చేసుకున్నాయి. తన హృదయం ఈవరకే పరాధీనమైంది. ఏ పరిస్థితుల్లోనూ దానిని కాదని, తన శరీరం అన్యాధీనం కాబోదు. రెండేళ్ళ దుఃఖం కాకుండా, అతని చదువు సంస్కారాలను సద్వినియోగం చేసుకోవలసిన అవుసరం ఏర్పడిన సమయం. ఫలితం కోసం అడుగు ముందుకు వేయడం అతని యిష్టానుసారం.

ఏకధాటిగా సాగిన ఉపన్యాసం వినేసరికి మురళీధరుడికి తల తిరిగిపోయింది. అతను ప్రపంచం తెలియని పసిబాలుడు గాదు. గ్రాడ్యుయేటు; సభ్యతా సంస్కార యుతమైన ఉద్యోగం చేస్తున్నాడు. స్త్రీలోని ప్రణయాన్ని, ప్రళయాన్ని అనుభవించకపోయినా, ఆ స్వరూపం తెలుసుకోలేని వయసు కాదు; విజ్ఞానం లేకుండా పోలేదు.

ఒక అరగంట సుమారు నిశ్శబ్దం ఘనీభవించింది. తనకు సమాధానం ఏమనిస్తాడో తెలియని పరిస్థితి రాధది. సమాధానం ఏమనివ్వాలో తెలియని పరిస్థితి మురళీధరునిది.

'రాధా, పరిస్థితి అర్థమైంది; నువ్వెళ్లు. మిగిలినది నేను చూచుకుంటాను.' నిశ్శబ్దాన్ని భంగపరిచాడు భారంగా.

* * *

వధువుతో పాటు వరుడుకూడా అనంగీకారం ప్రకటించగానే పెద్దలంతా తెల్లబోయారు. పెండ్లిపత్రిక లచ్చై పోయాయి, గాని ఎవరికీ యింకా పంపకపోయి ఉండడం, కాస్త గ్రుడ్డిలో మెల్ల.

అన్నిరకాల సాధక బాధకాల్ని అనునయించి జోకొట్టగలది కాలం. ఈలోగా జరిగే విచిత్రాలు జరుగుతుంటాయి. పట్టుదలలు పంతాలు వస్తూ పోతూంటాయి. అలాంటిదే ఒకటి; అదే లగ్నానికి బి. యస్‌సి. పాసైన అమ్మాయితో మురళీధరుని వివాహం జరిపించింది వాళ్ళమ్మ. కాసంత కట్నం పుచ్చుకోనని ఆదర్శవంతు డనిపించుకున్నాడు మురళీధరుడు.

రాధ హాయిగా ఊపిరి పీల్చుకుంది. మామూలుగా ఉద్యోగానికి పోతోంది. నలుగురూ మామూలుగా సంతోషంగా కాలం గడుపుతున్నారు. కృష్ణ తన తలిదండ్రులకు ఉత్తరం వ్రాశాడు, వచ్చి విషయాలు మాట్లాడుకోమని.

ఉత్తర ప్రత్యుత్తరాలు యథావిధిగా జరిగాక ఒకనాడు కృష్ణ తలిదండ్రులు లాంఛనప్రాయంగా వచ్చారు పిల్లను చూడడానికి. ఉభయులు యిష్టపడ్డారు రాధాసుందరి అందరికీ ఫలహారాలు యిచ్చింది. ఘట్టం సుఖాంతం కాబోతోంది. అంతలో భానుమూర్తి వచ్చాడు. వధూవరులకు చెరొక పేకట్టు యిచ్చాడు. అంద రాశ్చర్యంగా చూస్తున్నారు.

విప్పిచూస్తే బట్టలు; కృష్ణకు రియాన్ పాంటుబట్ట, సిల్కు షర్టుబట్ట; రాధకు నైలాన్ చీరె, జాకెట్టు బట్ట.

దీని భావమేమి తిరుమలేశ !...అని అందరూ చూస్తుంటే కృష్ణ చిరునవ్వు చిందిస్తున్నాడు. దీపావళీ సంచిక పడవేశాడు భానుమూర్తి. దీపావళి కథానికల పోటీలో 'హృదయ స్పందనం' కథ వ్రాసిన కృష్ణారావుకు ప్రథమ బహుమానం! ఫొటోతోసహా ప్రచురించబడింది.

ఆ విధముగా కథానికల పోటీ కృష్ణారావుకు అర్థద్వయ (రెండు బహుమానములకు) కారణభూతమై ద్వ్యర్థి ఐంది.